# కొడి దులిపిన దీపం

'స్త్రీలు ఉద్యోగం చెయ్యకూడదని కాదుగానీ, చెయ్యవలసిన అవసరం రావడం మాత్రం చాలా దురదృష్టకరం' అనుకొన్నది జానకి, తనకా ఆఫీసులో టైపిస్టుగా ఉద్యోగం యివ్వగానే.

ఆక్షణాన తనా ఉద్యోగంకోసం చేసిన ప్రయత్నాలేవీ జానకి మనస్సులో లేవు. ఆ ఉద్యోగం రాదేమో నన్న భయంతో కొన్ని రాత్రులు నిద్రపోకుండా ఉన్న సంగతులు కూడా జానక్కి జ్ఞాపకం లేవు. ఆమెకున్నదల్లా వొక్క రవణ మాత్రమే!

'రవణను చూసి తను అసూయగానీ పడుతున్నానా?' అన్న అనుమానం కూడా జానక్కి కలుగ సాగింది. రవణ నిజానికి తనకే విషయంలోనూ పోటీకాదు. కాకపోతే ఇద్దరూ కొంతకాలంపాటు కలిసి చదువుకొన్నారు. ఇతరులు అసూయ పడేంతగా స్నేహం చేశారు. చాలామంది పోచికోలు వెధవలు 'వీరిద్దర్నీ వొకడు చేసుకోవటానికయినా వొప్పుకుంటారు గానీ స్నేహం మాత్రం వదలరు' అని కూడా అన్నారు.

కానీ ఏం జరిగిందట? రవణ స్కూల్ ఫైనలు పరీక్ష రాశాక, పెళ్ళి చేసుకొంది. ఫలితాలు రాకముందే మొగుడుతో పట్నం వెళ్ళిపోయింది. వెళ్ళిన మొదట్లో ఉత్తరాలు ఎడా పెడా రాసి పడేసింది. ఇప్పుడవి రావడం లేదు. తన కేమనిపిస్తున్నదంటే – స్నేహితమయినా, కొన్ని పరిస్థితుల్లో

సాధ్యమని, ఆపరిస్థితులు మారగానే, ఆ వ్యక్తుల మధ్యగల సంబంధాలుకూడా మారిపోతాయిా అని! మరిప్పుడు రవణకూ తనకూ మధ్యగల సంబంధాలు మారాయూ లేదా ?

ఇంటి కొచ్చి తండ్రితో తన వుద్దేశం చెప్పింది జానకి. పురుషోత్తంగారి ముఖం మబ్బుకమ్మి నట్లయిపోయింది. మరి కాస్సేపటికి ఆ మబ్బు వర్షించింది కూడా.

'చివరకు నీ సంపాదన మీాద బ్రతకాల్సి వచ్చిం దమ్మాయ్! అదే నాకు పట్టుకొన్న చింత' అన్నారు పురుషోత్తంగారు.

'తప్పేముంది నాన్నా! నేనే మొగవాణ్నయితే మీారీ మాట అనే వారేనా ? రేపు తమ్ముడు పెద్దవాడయి నాలుగు రాళ్ళు తెస్తే నేను మాత్రం ఈ ఉద్యోగం చేస్తానా ? అదీ గాక ఇంట్లో కూచుంటే ఏంతోస్తుంది చెప్పండి! కాస్త కాల క్షేపమూా అవుతుంది. చిల్లర మల్లర ఖర్చులకు రవంత చేమెల్లాగానూ ఉంటుంది' అన్నది జానకి.

పురుషోత్తంగారి హృదయాని క్కావలసింది గూడా యిటువంటి ఓదార్పే! ఆ సంగతి తెలిసిన దానిలాగా జానకి ఆ ముక్కలే వొప్పగించింది.

ఆవిడకు ఉద్యోగం చెయ్యడం అనుకొన్నంత సుల భంగా కనపడ లేదు. చీటికి మాటికి తోటివారు ఏదో నెపంతో పలకరించడం ఆవిడ గమనిస్తూ వచ్చింది. ఆ పలకరింపులో అవసరంకన్నా అవహేళన పాళ్ళు ఎక్కువగా ఉన్నట్లు కూడా జానకి గమనించింది. ఇదెందుకు జరుగు తున్నదో జానకి పసి గట్టింది. భగవంతుడు తన కంతో ఇంతో అంద మిచ్చాడు. అది పాపమే అయితే, ఆ పాపఫలం తను అనుభవించక

తప్పదు. ఇందువల్ల తన కేదో అడ్డిపోతుందని కాదుగానీ, వాళ్ళు పొందే ఆనంద మేమిటో మాత్రం తనకు అర్థం కాకుండా ఉంది.

ఓరోజు సాయంత్రం జానకి రిక్షా ఎక్కుతూ వుంది. రాజారావు ఆ రిక్షా దగ్గరికి బెదురుతూ వచ్చాడు.

ఏమిటన్నట్టు చూసింది జానకి.

'ఇవ్వాళ పనితో చాలా అలిసిపోయి నట్టున్నారు. కాఫీ తాగుదాం రండి' అన్నాడు రాజారావు.

జానకి మారు మాట్లాడకుండా అతనితో కాఫీకెళ్ళింది. 'ఫామిలీ' అన్న గది కేసి దారితీశాడు రాజారావు. జానకి తనలో తనే నవ్వుకొంది.

కాఫీ తాగుతున్నంతసేపూ రాజారావూ ఏదో చెప్పాలనే ప్రయత్నించాడు. ఆ ప్రయత్నాన్ని జానకి ప్రోత్సహించినట్లయితే ఏమయ్యేదో గాని, ఆమె మాత్రం ఆ పని చెయ్యలేదు. అతని నోటంటే ఆ మాటలు వినాలనుకొన్నది.

'వెడదామా?' అన్నది జానకి కాస్సేపయ్యాక.

'ఊఁ' అని మూలిగాడు రాజారావు.

రాజారావే బిల్లు చెల్లించాడు.

'మనమట్లా కాస్సేపు పబ్లిక్ గార్డెన్‌లో కూచుందామా?' అన్నా డతను. అక్కడయితే తను చెప్పదలచుకొన్నది చెప్పగల ననుకొని.

జానకి తల అడ్డంగా తిప్పింది.

'ఇంటిదగ్గర నా కోసం కనిపెట్టుకొనిఉండే వారున్నారు. ఆలస్యమైతే వాళ్ళు తహతహ లాడిపోతారు' అన్నది జానకి.

'ఎంతోసేపా? ఓ పావుగంట' అన్నాడు రాజారావు.

'ఎంతసేపయినా కూచోవచ్చు ననుకోండి. అవతల మా వాళ్ళు గిజ గిజ లాడిపోతుంటారన్న జ్ఞాపకం నన్ను బాధిస్తూనే ఉంటుంది. పార్కులో కూచుని మాత్రం ఏం లాభం?' అన్నది జానకి.

రాజారావు ముఖం పాలిపోయి నట్లయింది.

'పోనీ ఈ సంగతి నిన్ననాన్నా చెప్పక పోయారా, ఆలస్యంగా వస్తానని ఇంటి దగ్గర అని ఉందునే,' అన్నది జానకి.

'అయితే రేపు—' అన్నాడు రాజారావు.

'అలాగే!' అన్నది జానకి.

'ఈ రాత్రి రాజారావు సరిగ్గా నిద్రపోడు' అనుకొన్నది జానకి. చిత్ర మేమిటంటే, రాజారావు నిద్రపోడన్న ఆలోచనతో జానకి నిద్రపోలేదు. ఉదయం లేచేసరికి ఆమె కళ్ళు మంట లెత్తాయి.

'ఈ పూట నేను కొంచెం ఆలస్యంగా వస్తాను నాన్నా!' అన్నది జానకి ఆఫీసుకు పోబోతూ.

'ఏం?' అన్నాడు పురుషోత్తం.

'ఎవరో స్నేహితులు కాఫీకి పిలిచారు.'

పురుషోత్తం ఏమీ మాట్లాడలేదు గానీ, జానకి ఆలస్యంగా రావడం ఆయన కిష్టంలేనట్లు తేలిపోయింది. ఆ సంగతి జానకి గమనించింది. ఐనా ఈసారి తండ్రిహృదయాన్ని జోకొట్టడానికి ప్రయత్నించలేదు.

జానకి అనుకొన్న మాటనిలబెట్టుకొంది. రాజారావూ, ఆవిడ పబ్లిక్ గార్డెన్‌లో మరాలగా కూచున్నారు. అతని చేతిలో ఏదో పొట్లముంది.

'ఏమిటో చెప్పండి.' అన్నది జానకి.

'మీ కింకా పెళ్ళి కాలేదని విన్నాను.' అంటూ ప్రారంభించాడు రాజారావు.

జానకి ఫక్కున నవ్వింది.

'పెళ్ళయితే ఉద్యోగం చేసే అవకాశం ఉండేది కాద నుకొంటాను' అన్నది జానకి.

'అదేం?' అన్నాడు రాజారావు.

'పెళ్ళికొడుకు వొప్పుకొంటాడా?' అన్నది జానకి.

'నాకూ ఇంకా పెళ్ళి కాలేదను కొండి. అయివుంటే నా భార్య ఉద్యోగం చెయ్యడానికి నే నంగీకరించి ఉండేవాణ్ణి. ఎందుకంటే—'

'అయితే మీరు చాలా మంచి వారన్నమాట' అన్నది జానకి.

రాజారావు పొంగిపొయ్యాడు.

చాలామంది మగవారికి నాగరికమైన భార్యలు కావాలి. కానీ ఆ నాగరికత ఇచ్చే హక్కులను అడవాళ్ళు ఉపయోగిం చుకోవడం కిట్టదు. ఇది ఏ వొక్కరినో దృష్టిలో ఉంచుకొని నేననడం లేదు. సర్వ సామాన్యంగా ఇలానే జరుగుతూ వుం టుంది. నా ఉద్యోగం డబ్బులు మా నాన్నకు కావాలి. కానీ, నే నెక్కడ పొరబాటు పడతానోనని ఆయన భయం,' అన్నది జానకి.

'ఆ భయానికి కారణాలు లేవంటారా?' అన్నాడు రాజారావు.

జానకి మాట్లాడ లేదు.

రాజారావు కాస్సేపు జానకి ముఖం కేసి కన్నార్పకుండా చూసి, తరవాత చుట్టూ చూశాడు.

'మీ కభ్యంతరం లేకపోతే మీ పెళ్లిని గురించి మీ నాన్న గారితో మాట్లాడదా మను కొంటున్నాను,' అన్నాడు రాజారావు.

జానకి కాస్సేపు రాజారావు ముఖం వేపు చూసింది. తరువాత మెల్లగా నవ్వింది. ఆ నవ్వు చూశాక రాజారావుకి ఎక్కడలేని ఉత్సాహం పుట్టుకొచ్చింది.

'మాదీ అంత ఉన్న కుటుంబం కాదు. మేనరికం చేసు కొంటే, కొంత కలిసొచ్చేమాట నిజమేగానీ, ఆసంబంధం చేసు కోవడం నా కిష్టం లేదు. మావాళ్ళేమో నా ప్రాణాలు తోడే స్తున్నారు. నేను లొంగదలచుకోలేదు' అన్నాడు రాజారావు.

'ఎందుకని?' అన్నది జానకి.

'ఇష్టంలేని ఆడదానితో కాపరం చెయ్యడం నావల్ల కాదు' అన్నాడు రాజారావు. 'మీకు అభ్యంతరం ఉండదను కొంటాను' అని ఆమె సమాధానంకోసం ఆశగా చూశాడు.

'ఉంటుంది!' అన్నది జానకి.

రాజారావు బిత్తరపోయాడు.

'నాకూ ఓ తమ్ముడూ, నాన్నా ఉన్నారు. మిమ్మల్ని చేసుకొని మీతో కులుకుతూ ఉంటే, వాళ్ళిద్దరూ అన్యాయ మయిపోరు?' అన్నది జానకి.

'వాళ్ళూ మనతోనే ఉంటారుగా!' అన్నాడు రాజా రావు.

'అట్లా వీలుండదు లెండి!' అన్నది జానకి దీర్ఘంగా నిట్టూరుస్తూ. 'తల్లినీ, తండ్రినీ మీరు గౌరవించలేక పోయినప్పుడు మామను, బావమరదినీ గౌరవిస్తారని, నే నెట్లా అనుకొంటానండీ? వాళ్ళ పరువు మర్యాదలను కాపాడవలసిన బాధ్యత మీకున్నది గదా! దాన్నుండి తప్పు కొన్నవారు మా బాధ్యతను నిడివేరుస్తారంటే, నేను నమ్మలేను.'

జానకి లేచి నిలబడింది. రాజారావూ నిలుచున్నాడు. అత నేదో చెప్పబోయాడు. జానకి వినిపించుకోకుండానే వెళ్ళిపోయింది.

'అలా ఉన్నావేం తల్లీ?' అన్నాడు పురుషోత్తంగారు, జ్వరపడిన దానిలా ఉన్న కూతురును చూసి.

'ఏం లేదు.' తన్ను తాను నిగ్రహించుకో లేకపోయింది. దిండులో ముఖం దాచుకొని బావురు మని ఏడ్చింది. పురుషోత్తంగారికి జానకి తనెందు కంతగా ఏడ్చింది యిప్పటికీ కూడా తెలీదు.